# సాక్షి
## అన్నమయ్య జిల్లా

శనివారం । 23 । మార్చి । 2024






### విద్యా పరిమళాలు
సామాజిక స్పృహ కల్పించిన ప్రజాకవి పేరుతో ఏర్పాటైన యోగివేమన విశ్వ విద్యాలయం వ్యవస్థాపక, వార్షికోత్సవ వేడుకలకు సిద్ధమైంది. -IIలో

### రంజాన్ వేళలు

| | ఇఫ్తార్ శని (సా॥) | సహర్ ఆది (ఉ॥) |
|---|---|---|
| రాయచోటి | 6.31 | 4.57 |
| రాజంపేట | 6.31 | 5.00 |
| పీలేరు | 6.34 | 4.55 |
| మదనపల్లె | 6.32 | 5.04 |

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

| | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| మొదటిరకం | రూ.140 | రూ.170 |
| రెండోరకం | రూ.80 | రూ.146 |

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 32 మెట్రిక్ టన్నులు



## న్యూస్‌రీల్

### విద్యార్థులకు వేసవి క్రీడా శిక్షణ
**రాయచోటి టౌన్:** విద్యార్థులకు మే 1 నుంచి 31వ తేదీ వరకు వేసవి క్రీడా శిక్షణలు నిర్వహిస్తున్నట్లు అన్నమయ్య జిల్లా స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.జిల్లా వ్యాప్తంగా 50 శిక్షణ కేంద్రాల్లో వివిధ రకాల క్రీడలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.కేంద్రాల నిర్వహణకు క్రీడా సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఫిజికల్ డైరెక్టర్లు, కోచ్‌లు, సీనియర్ ప్లేయర్లు జిల్లా కేంద్రమైన రాయచోటిలోని డీఎస్‌ఏ కార్యాలయంలో ఈ నెల 29వ తేదీ లోగా నేరుగా దరఖాస్తులు అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 9440297692 నంబర్లో సంప్రదించాలని తెలిపారు.

### జిల్లాకు 50 కొత్తబస్సులు



చలివేంద్రాన్ని ప్రారంభించిన డీపీటీవో రాము

**పీలేరురూరల్:** వారం రోజుల్లో జిల్లాకు 50 కొత్త బస్సులు రానున్నాయని జిల్లా డీపీటీవో రాము అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఆర్టీసీ ఉద్యోగులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు డిపోకు 7 కొత్త బస్సులు రానున్నట్లు చెప్పారు. గత ఏడాది కంటే ఈ ఏడాది రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పట్టినట్లు చెప్పారు. గత ఏడాది 20 ప్రమాదాలు జరిగాయని, ఈ ఏడాది 14 ప్రమాదాలు జరిగినట్లు వివరించారు. జిల్లాలో రాయచోటిలో కొత్తబస్టాండ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు వివరించారు కార్యక్రమంలో డీఎం కుమార్, సీఐ సుబ్బమ్మ, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

### కార్మికుల పట్ల జాగ్రత్తలు పాటించాలి
**కడప కోటిరెడ్డిసర్కిల్:** రోజురోజుకు ఉష్ణోగ్రతలు, వడగాల్పులు అధికమవుతున్న తరుణంలో పరిశ్రమల యాజమాన్యాలు, నిర్మాణ పనుల యజమానులు, షెడ్ల యజమానులు కార్మికుల పట్ల జాగ్రత్తలు పాటించాలని కార్మికశాఖ సహాయ కమిషనర్ శ్రీకాంత్‌నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. వడగాల్పుల నుంచి ఉపశమనం పొందేందుకు కార్మికులకు పనుల వద్ద ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ, మంచినీటి సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. కార్మికుల చేత ఉదయం 11 గంటల వరకు, సాయంత్రం 4 గంటల తర్వాత పనులు చేయించుకోవాలని సూచించారు.

### 3న ఎస్సీ రాజకీయ చైతన్య వేదిక సభ
**కడప రూరల్:** ఎస్సీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వచ్చే నెల 3వ తేదీన కడప వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించే రాజకీయ చైతన్య వేదిక సమావేశం జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాజ తెలిపారు. శుక్రవారం స్థానిక డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం సర్కిల్ వద్ద పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీల ఐక్యత, అభ్యున్నతి కోసం నిర్వహించే సమావేశంను జయప్రదం చేయాలని కోరారు.

# ఆరోగ్యానికి పట్టణం


**నాడు** టీడీపీ ప్రభుత్వ హయంలో పెద్ద పట్టణాల్లో ఒక్కటే అర్బన్ హెల్త్ సెంటర్ ఉండేది. అది కూడా పీపీపీ కింద నడిచేది. అందులో అరకొర సౌకర్యాలు ఉండేవి. వైద్యులు ఎప్పుడు వస్తారో తెలియదు. మందులు ఇవ్వరు. తూతూ మంత్రంగా నడిచేవి. పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు.

**నేడు** వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అర్బన్ హెల్త్ సెంటర్ల రూపురేఖలు మారాయి. వైద్యులతో పాటు సిబ్బంది నియమించారు. మురికివాడల్లో నివాసమున్న ప్రజలు నిత్యం అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తున్నారు. సొంత భవనాల్లో కార్పొరేట్‌కు దీటుగా అర్బన్ హెల్త్ సెంటర్లు నడుస్తున్నాయి.

- కార్పొరేట్‌కు దీటుగా అర్బన్ హెల్త్ సెంటర్ల సేవలు
- ఓపీతో పాటు 60 రకాల వైద్య పరీక్షలు
- ప్రతి సెంటర్‌లో వైద్యుడు, సిబ్బంది

**మదనపల్లె సిటీ:** వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్టణ పేదలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు అర్బన్ హెల్త్ సెంటర్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. వీటి ద్వారా గర్భిణులు, బాలింతలతో పాటు బీపీ, షుగర్, ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి మెరుగైన సేవలందిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో 11 అర్బన్ హెల్త్ సెంటర్లలో రెగ్యులర్ వైద్యుడితో పాటు సిబ్బంది అందుబాటులో ఉంటారు. వారంలో ఒకసారి స్పెషలిస్టు వైద్యుడి ద్వారా సేవలందిస్తున్నారు. దాదాపు 60 రకాల రక్తపరీక్షలతో పాటు ఉచితంగా మందులను సైతం అందిస్తూ నిరుపేదల ఆరోగ్యానికి భరోసా ఇస్తున్నారు.

| పట్టణం | సెంటర్లు |
|---|---|
| మదనపల్లె | 5 |
| రాయచోటి | 4 |
| రాజంపేట | 2 |




మదనపల్లె మోతీనగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్




- వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లలో ఒక మెడికల్ ఆఫీసర్ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైద్య సేవలు అందిస్తారు. వీరితో పాటు ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఒక ల్యాబ్ టెక్నీషియన్ ,ఫార్మసిస్టు, అటెండర్ సేవలందిస్తారు. వీరు కాకుండా ప్రతి సోమవారం ఒక స్పెషలిస్టు డాక్టర్ సేవలందిస్తారు.

**వైద్య సేవలు ఇలా...**
అర్బన్‌హెల్త్ సెంటర్లలో జ్వరం, జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులు, వాంతులు, విరేచనాలతో పాటు గర్భిణులు, బాలింతలకు బీపీ,షుగర్ వంటి దీర్ఘ కాలిక జబ్బులతో బాధపడే వారికి రెగ్యులర్ డాక్టర్ సేవలందిస్తారు. ఒక వేళ క్రిటికల్ కేసు అయితే టెలీహబ్ ద్వారా వైద్యులతో మాట్లాడి వైద్య సేవలందిస్తారు.

**ల్యాబ్‌లో 60 రకాల వైద్య పరీక్షలు**
బీపీ,షుగర్, హిమోగ్లోబిన్, ల్యూకోసైట్ కౌంట్, మలేరియా, టైఫాయిడ్, డెంగీ, ప్లేట్‌లెట్ కౌంట్, ఈఎస్ఆర్, సీటీ, బీటీ, బ్లడ్ యూరియా, సీరం, క్రియాటిన్, బిలిరుబిన్, ఎస్జీఓటీ, ఎస్‌జీపీటీ, అల్కలైన్, పాస్పేట్, టోటల్ ప్రోటీన్, సీరం ఆల్బుమిన్, సీరం హెచ్‌డీఎల్,ఏఎఫ్‌బీ (కఫం), మలం విశ్లేషణ కోసం ఓపీఏ, సీవైఎస్టీ, గర్భిణులకు మూత్ర పరీక్షలతో సహా మొత్తం 60 రకాల పరీక్షలు ఉచితంగా చేస్తారు.

గడిచిన ఆరు నెలల్లో ఔట్ పేషెంట్ల సేవలు..

| నెల | వైద్యం పొందినవారు |
|---|---|
| 2023 అక్టోబర్ | 7,615 మంది |
| నవంబర్ | 7,538 మంది |
| డిసెంబర్ | 7,356 మంది |
| 2024 జనవరి | 7,324 మంది |
| ఫిబ్రవరి | 7415 మంది |
| మార్చి (20 వరకు) | 5109 మంది |

### వైద్య సేవలు బాగున్నాయి..



నాకు బీపీ, షుగర్ ఉంది. వైద్య కోసం అర్బన్ హెల్త్ సెంటర్‌కు వస్తున్నా. అన్ని పరీక్షలతో పాటు ఉచితంగా మందులు ఇస్తున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల కంటే ఇక్కడ వైద్యులు మంచి వైద్యం అందిస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తున్నారు. ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం. -సలీమ్‌బాషా, మదనపల్లె

### 'కార్పొరేట్'కు దీటుగా వైద్యసేవలు



నాకు ఆరోగ్యం బాగలేకపోతే అర్బన్ హెల్త్ సెంటర్‌కు వెళతాను.. కార్పొరేట్ ఆస్పతిలో చేసే వైద్యం ఇక్కడ చేస్తున్నారు. అన్ని రకాల మందులు ఉచితంగా ఇస్తున్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేదల వైద్యం కోసం చేస్తున్న సేవలు చాలా గొప్పవి. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు. -నవాజ్‌బాషా, మదనపల్లె

## ఈసీకి రోజువారీగా నివేదికలు పంపించాలి
జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్



**రాయచోటి:** సార్వత్రిక ఎన్నికలు-2024 కోసం కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ నుంచి రోజు వారి నివేదికలను ఎప్పటికప్పుడు ఎన్నికల కమిషన్(ఈసీ)కు పంపించాలని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ నోడల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం రాష్ట్ర ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా విజయవాడ నుంచి అన్ని జిల్లా కలెక్టర్‌లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సార్వత్రిక ఎన్నికలు-2024పై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి కలెక్టరేట్‌నుంచి జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌లు పాల్గొన్నారు. అనంతరం జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించిన రోజువారి నివేదికలను ఎన్నికల సంఘానికి అందజేసే విషయంలో ఎటువంటి అలసత్వాన్ని ప్రదర్శించరాదని నోడల్ అధికారులకు సూచించారు.

**టోల్‌ఫ్రీ నంబర్‌ను సద్వినియోగం చేసుకోండి**
ఎన్నికల ఫిర్యాదులు, ఇతర వివరాల కోసం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్‌ను (1800 425 7090) సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం ఎన్నికలు-2024కు సంబంధించి ఫిర్యాదులు, ఇతర వివరాలకు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్ 1800 425 7090ను జిల్లా ఎన్నికల అధికారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎటువంటి ఫిర్యాదునైనా ఈ టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి నమోదు చేయవచ్చన్నారు. ఈ టోల్‌ఫ్రీ నంబర్24/7 పనిచేస్తుందన్నారు. ఫిర్యాదులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్ 1950కి అదనంగా పనిచేస్తుందన్నారు.

## వైభవం..నృసింహుని రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

**గుర్రంకొండ:** మండలంలోని తరిగొండ గ్రామంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. అంతకు ముందు ఆలయంలో ధూళి ఉత్సవం నిర్వహించారు.అనంతరం స్వామివారిని అందంగా అలంకరించి తేరు(రథం)లో కొలువుదీర్చారు. భక్తుల గోవింద నామ స్మరణలు చేస్తూ రథాన్ని లాగారు. రథోత్సవాన్ని పురస్కరించుకుని పలువురు అన్నదానం ఏర్పాటు చేశారు. తరిగొండతోపాటు పరిసర గ్రామాల ప్రజలు చాందీనీ బండ్లు, అన్నం,టెంకాయ బండ్లను ఆలయం చుట్టూ తిప్పారు.ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి రథోత్సవంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

## పూటకో మాట.. అయినవారికే పీట

ఇష్టారీతిన టీడీపీ అధిష్టానం

**సాక్షి ప్రతినిధి, కడప:** తెలుగుదేశం పార్టీ అధిష్టానం నిబంధనలు, సూత్రాల పేరిట పూటకో మాట చెప్పి.. చివరికి అయినవారి కోసం దానిని తప్పుతోంది. మూడో జాబితా విడుదల తర్వాత టీడీపీ శ్రేణుల్లో ఈ విషయమై తీవ్ర అసంతృప్తి నెలకొంది.

**వాసు.. శల్యసారథ్యం**
బాధ్యతలను నిర్వర్తించాల్సిన వ్యక్తి ఉద్దేశ్యపూర్వకంగా చెడగొట్టడాన్ని శల్య సారథ్యం అంటారు. అచ్చం అలాంటి పరిస్థితి వైఎస్సార్ జిల్లా కమలాపురం టీడీపీ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డికి ఎదురైందని తెలుగుతమ్ముళ్లు విశ్వసిస్తున్నారు. మరోమారు ఎన్నికల్లో తలపడి ఎమ్మెల్యే అనే జీవితాశయం నెరవేర్చుకోవాలనే పట్టుదలతో పుత్తా ఉండేవారు. అంతలోనే 'ఇంట్లో వాడే కంట్లో పుల్ల' అన్నట్లుగా జిల్లాలో టీడీపీ బాధ్యతలు నిర్వహిస్తున్న వాసు(రెడ్డెప్పగారి శ్రీనివాసులు రెడ్డి) కారణంగానే పుత్తాకు టికెట్ దక్కలేదని అభిప్రాయపడుతున్నారు. అధిష్టానానికి తనపై పితూరీలు వల్లించిన కారణంగానే ఈమారు టికెట్ తాను కోల్పోయినట్లు సన్నిహితులతో వ్యాఖ్యానిస్తున్నట్లు సమాచారం. వరుసగా మూడుసార్లు ఓడిపోయినోళ్లకు ఈమారు ఎన్నికల్లో టికెట్ ఇవ్వడం లేదని గతంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రకటించారు. అయితే ఇది నిజం కాదని శుక్రవారం రుజువైంది. టీడీపీ మూడో జాబితాలో నెల్లూరు జిల్లా సర్వేపల్లె నియోజకవర్గ అభ్యర్థిగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని ప్రకటించడంతో ఆ విషయం తేటతెల్లమైంది. 2004 నుంచి 2019 వరకూ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నాలుగు సార్లు ఓడిపోయారు. అదనంగా మధ్యలో 2012 ఉప ఎన్నికల్లో నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేతిలోనూ ఓడిపోయారు. ఈ లెక్కన వరుసగా 5 సార్లు ఓడిపోయిన చరిత్ర ఉన్న సోమిరెడ్డికి దక్కిన టికెట్ తనకు ఎందుకు దక్కలేదని పుత్తా మండిపడుతున్నట్లు సమాచారం.

- ప్రొద్దుటూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి కూడా జిల్లా కీలకనేత టికెట్ నీదేనని ఆశలు రేకెత్తించారు.అయితే మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డికి అవకాశం లభించింది.

**ఒక్కటే టికెట్ ఉత్తిమాటే**
కుటుంబానికి ఒక్కటే టికెట్, ఇరువురికి ఇచ్చేది లేదని ఇంతకాలం టీడీపీ అధిష్టానం చెప్పుకొచ్చింది. ఇప్పుడామాట కూడా ఉత్తిదేనని రుజువైంది. మైదుకూరు టీడీపీ అభ్యర్థిగా పుట్టా సుధాకర్‌యాదవ్‌ను ప్రకటించారు. ఆయన కుమారుడు మహేష్ యాదవ్‌ను ఏలూరు ఎంపీ అభ్యర్థిగా ఎంపిక చేశారు. పార్టీ కోసం పనిచేసిన చరిత్ర కొలమానం కాకుండా కాసుల సంచుల స్థాయిని బట్టి టికెట్లు కేటాయిస్తున్నారని అభ్యర్థుల ప్రకటన మూడో జాబితా ద్వారా రుజువైంది. అదే విషయాన్ని మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి కూడా ఎత్తి చూపుతున్నారు. రాయచోటి ఇన్‌చార్జిగా పార్టీ ఉన్నతికి ఐదేళ్లు విశేషంగా పనిచేసిన తనకు టికెట్ నిరాకరించడాన్ని తప్పు పడుతున్నారు. ఆయన సోదరుడు శ్రీనివాసులరెడ్డి భార్య మాధవీరెడ్డికి కడప టికెట్ ఇచ్చారనే కారణంతో రమేష్‌రెడ్డికి నిరాకరించారు. ఇదే నిబంధన పుట్టా కుటుంబానికి కూడా వర్తించాలి కదా అని ఆయన నిలదీస్తున్నారు.

# పోస్టల్ బ్యాలెట్‌కు పచ్చజెండా

- పట్టాలెక్కినా..ఇక ఓటేయ్యొచ్చు!
- తొలిసారిగా రైల్వే కార్మికులకు అవకాశం కల్పించిన ఎన్నికల సంఘం
- ప్రత్యేకంగా నోడల్ అధికారి నియామకం



రైలు (ఇన్‌సెట్) పోస్టల్‌బ్యాలెట్


**రాజంపేట:** భారతదేశంలో అతిపెద్ద రవాణా వ్యవస్థ రైల్వే. అటువంటి రైల్వేలో లక్షలాది మంది కార్మికులు 70 శాతం నిత్యం విధుల్లో ఉంటారు. అటువంటి వారికి ఓటువేసే భాగ్యాన్ని భారత ఎన్నికల సంఘం కల్పించింది. మేము ఎలా ఓట్లు వేయాలని అత్యవసర సేవలందించే సిబ్బంది అనుకునేవారు. విధి నిర్వహణలో ఉన్నప్పుడు వీరంతా కొన్ని దశాబ్ధాలుగా ఎమ్మెల్యే, ఎంపీ, స్థానికసంస్థల ఎన్నికలకు దూరంగా ఉండాల్సి వచ్చేది. తొలిసారిగా పోస్టల్‌బ్యాలెట్‌కు రైల్వేకు కేంద్రఎన్నికల సంఘం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పోస్టల్‌బ్యాలెట్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న తరహాలోనే తమకు ఇవ్వాలనే డిమాండ్ ఇన్నాళ్లకు నెరవేరింది. తమకు ఓటు వేసే భాగ్యం కలిగిందని కార్మికులు, ఉద్యోగులు సంబరపడుతున్నారు.

-గుంతకల్ రైల్వే డివిజన్ పరిధిలోని రాయలసీమ జిల్లాల్లో 14వేలమందికిపైగా కార్మికులు, ఉద్యోగులు, అధికారులు ఉన్నారు. ఉభయ వైఎస్సార్ జిల్లా కొండాపురం నుంచి రైల్వేకోడూరు వరకు 2వేలమందికిపైగా కార్మికులు ఉన్నారు.అత్యవసర సేవలో ప్రధానంగా రన్నింగ్‌స్టాఫ్(పైలెట్లు, అసిస్టెంట్ లోకోపైలెట్, గార్డులు)తో పాటు టీటీఈ, స్టేషన్‌మాస్టర్, ఆరోజు విధుల్లో ఉండే ఇతర విభాగాలకు చెందిన అధికారులు, కార్మికులు తాము నివసించే ఏరియా పోలింగ్‌బూత్‌కు వచ్చి ఓటు వేయలేని పరిస్థితులు నెలకొంటాయి. ప్రస్తుతం వీరు పోస్టల్ బ్యాలెట్‌ద్వారా ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

**ప్రణాళిక సిద్ధం..**
మొదటిసారిగా రైల్వేకార్మికులకు భారత ఎన్నికల సంఘం పోస్టల్‌బ్యాలెట్ సదుపాయం కల్పించేందుకు ప్రణాళికను సిద్ధం చేస్తోంది. గతంలో ఈ పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని కోరిన రైల్వే అధికారి రాంకుమార్‌కు సమాధానం ఇస్తూ రైల్వేకార్మికులను అత్యవసర సేవల్లో ఉంటున్న ఓటరు విభాగంలో చేర్చి పోస్టల్ బ్యాలెట్ సౌక్యరాన్ని కల్పిస్తున్నట్లు చెప్పారు.ఇందుకోసం ప్రజాచట్టం 1951 సెక్షన్ 60(క్లాజ్‌సీ)లో పేర్కొన్న వ్యకులతోపాటు రైల్వేలో పనిచేస్తున్న రన్నింగ్‌స్టాఫ్, గార్డులు,టీసీలకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పించే విధంగా 1961 ఎన్నికల నిబంధనను సవరించినట్లు సమాచారం.

- 33 విభాగాలలో వివిధ సేవల్లో ఉంటూ పోలింగ్‌రోజు ఓటు వేయలేని వారికి పోస్టల్ బ్యాలెట్ అవకాశాన్ని కేంద్ర ఎన్నికల సంఘం కల్పించింది. ఇందులో రైల్వే రవాణా, మెట్రోలను చేర్చింది. రాష్ట్రంలో లోక్‌సభతోపాటు అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో వివిధ సేవల్లో నిమగ్నమయ్యే విభాగాలను నోటిఫై చేసింది. ఆయా విభాగాల్లో సేవలందించే వారికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే సౌకర్యం కల్పించింది. ఇందుకోసం ప్రత్యేకంగా నోడల్ అధికారిని నియమించడంతోపాటు పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి 12 డీఫాం అందుబాటులో ఉంచాలని భారత ఎన్నికలసంఘం గత మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసింది.

### ఎన్నికల రోజు విధుల్లో ఉన్న వారికి పోస్టల్‌బ్యాలెట్



ఎన్నికల రోజు విధుల్లో ఉన్నవారికి పోస్టల్ బ్యాలెట్ ఇస్తారు. అయితే భారత ఎన్నికల సంఘం ఈసారి 33 విభాగాల్లో పనిచేసే వారికి ఈ అవకాశం కల్పించింది. ఈమేరకు ప్రత్యేకంగా నోడల్ అధికారి నియమించాం. రైల్వే ఉన్నతాధికారులతో సంప్రందించిన తర్వాత నోడల్ అధికారి విషయంపై నిర్ణయం తీసుకుంటాం. -టీ.మోహనరావు, రిటర్నింగ్ ఆఫీసర్, రాజంపేట

### సీఈసీ నిర్ణయం హర్షణీయం



రైల్వేశాఖలో పనిచేస్తున్న ఉద్యోగ, కార్మికులకు పోస్టల్ బ్యాలెట్ ఇవ్వాలని భారత ఎన్నికల సంఘం(సీఈసీ) నిర్ణయం తీసుకోవడం హర్షణీయం. పోస్టల్ బ్యాలెట్ లేకపోవడంతో వేలాదిమంది కార్మికులు తమ ఓటుహక్కును వినియోగించుకోలేని పరిస్థితి. ఇప్పటికైనా రైల్వే కార్మికులకు పోస్టల్ బ్యాలెట్ ఇచ్చే విధంగా కేంద్ర ఎన్నికల సంఘం సిద్ధం కావడం అభినందనీయం. -విశ్వనాథ్, సెక్రటరీ, ఎస్ఆర్ఎంయూ, నందలూరు బ్రాంచి

## ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలకు పటిష్ట బందోబస్తు

**ఒంటిమిట్ట:** ఒంటిమిట్ట కోదండరామస్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు అన్నారు. శుక్రవారం బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను కడప డీఎస్పీ షరీఫ్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఆలయ, కళ్యాణ వేదిక పరిసరాలను, ట్రాఫిక్ మళ్లింపుగల లింక్ రోడ్లను వారు పరిశీలించారు. కార్యక్రమంలో ఒంటిమిట్ట సీఐ పురుషోత్తం రాజు, ఎస్ఐ మధుసూదన్ రావు, ఒంటిమిట్ట టీటీడీ విజిలెన్సు అధికారి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



కళ్యాణ వేదిక పరిసరాలను పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు

### నేడు డయల్ యువర్ డీఎం
**రాయచోటి అర్బన్:** ఈ నెల 23వ తేదీ (శనివారం) డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాయచోటి ఆర్టీసి డీఎం ధనుంజయ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 12గంటల వరకు జరిగే కార్యక్రమంలో ప్రయాణికులు తమ సమస్యలను తెలియజేయవచ్చన్నారు. ఆర్టీసీ ఆదాయం ఎలా పెంచుకోవచ్చో సలహాలు, సూచనలు ఇవ్వవచ్చన్నారు. ప్రయాణికులు 9959225776 నంబర్లో సంప్రదించాలని తెలిపారు.

## క్లుప్తంగా

### ఆవు పొడిచి రైతుకు తీవ్ర గాయాలు

పెద్దతిప్పసముద్రం : స్థానిక పంచాయతీ పరిధిలోని కుమ్మరవారిపల్లిలో శుక్రవారం రామక్రిష్ణ (49) అనే రైతును ఆవు పొడవడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. ఇదే గ్రామానికి చెందిన చలపతి అనే ఆవు యజమాని ఓ వివాహ కార్యక్రమానికి వెళ్లగా.. ఆవుకు నీళ్లు తాపాలని ఫోన్ ద్వారా రామక్రిష్ణకు సూచించాడు. దీంతో షెడ్డు కింద ఉన్న ఆవుకు నీళ్ల తాపేందుకు ప్రయత్నించగా రామక్రిష్ణ వీపు భాగంలో పొడచి తీవ్రంగా గాయపరచింది. గాయపడిన రైతుకు మండల కేంద్రంలో ప్రథమ చికిత్స చేయించి అనంతరం 108 వాహనంలో మదనపల్లి ఆసుపత్రికి తరలించారు.

### అత్తింటి వేధింపులపై ఫిర్యాదు

మదనపల్లె : అత్తింటి వేధింపులపై ఓ మహిళ భర్తతో కలిసి శుక్రవారం డీఎస్పీ ప్రసాదరెడ్డికి ఫిర్యాదు చేసింది. మదనపల్లె మండలం బసినికొండకు చెందిన డి.భారతి, రాజేష్‌కుమార్ దంపతులు. కొంత కాలంగా వీరిని భారతి అత్త, మామ, మరిది కలిసి వేధింపులకు గురి చేస్తున్నారు. రాజేష్‌కుమార్‌పై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో తప్పుడు కేసులు పెట్టి మానసికంగా వేధిస్తున్నారని, భర్తను వదిలేసి వెళ్లిపోవాలని బెదిరిస్తున్నట్లు భారతి తెలిపింది. అత్తింటి నుంచి తమకు ప్రాణహాని ఉందని, పోలీసులు విచారణ చేసి న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొంది.

### ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

మదనపల్లె : ఐదుగురు వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ యువరాజు తెలిపారు. మదనపల్లె మండలం బండకిందపల్లెకు చెందిన రెడ్డెప్ప భార్య రాధమ్మ(42)కు పట్టణంలోని బీకే పల్లె సర్వేనంబర్: 435లో కొంత భూమి ఉంది. భూమికి సంబంధించి దారి విషయమై, పక్క పొలానికి చెందిన చాకలి ఆదినారాయణ, సిద్దేశ్వరి, సుధా, రెడ్డెప్ప రెడ్డి, మరొకరు గొడవకు దిగారు. గొడవలో భాగంగా రాధమ్మను కులంపేరుతో దూషిస్తూ దాడికి పాల్పడ్డారు. ఘటనపై రాధమ్మ ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ పేర్కొన్నారు.

# వేమన వెలుగుల్లో.. విద్యా పరిమళాలు

- నేడు వైవీయూ 18వ వార్షికోత్సవ వేడుకలు
- ముఖ్య అతిథులుగా ఎస్వీయూ, ఏఎఫ్‌యూ వీసీలు



వైవీయూ ముఖద్వారం

వైవీయూ : యోగివేమన నీకు వందనం.. విశ్వకవి తాత్వికా నీకు వందనం.. అన్న విశ్వవిద్యాలయ గీతంతో ఉత్తేజితులవుతూ.. సామాజిక స్పృహ కల్పించిన ప్రజాకవి పేరుతో ఏర్పాటైన యోగివేమన విశ్వవిద్యాలయం 18వ వ్యవస్థాపక, వార్షికోత్సవ వేడుకలకు సిద్ధమైంది. 2006 మార్చి 9వ తేదీన పీజీ కేంద్రం నుంచి విశ్వవిద్యాలయంగా రూపాంతరం చెంది నేడు 27 కోర్సులతో విలసిల్లుతోంది. దాదాపు 1500 మంది విద్యార్థులు, 100 మంది అధ్యాపక బృందం, 300 మంది దాకా బోధ నేతర సిబ్బంది, 100 మంది దాకా పరిశోధక విద్యార్థులతో ప్రగతి పథంలో దూసుకువెళ్తోంది. 1977 నవంబర్ 20వ తేదీన తిరుపతి శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం కడప నగర సమీపంలో పీజీ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక 2006లో 652 ఎకరాల్లో విశ్వవిద్యాలయంగా రూపుదిద్దుకుంది.

**అభివృద్ధికి అడుగులు.. ఇలా...**

యోగివేమన విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విశ్వవిద్యాలయానికి నిధుల వరద పారించారు. వైవీయూకు 2012లో 12బీ గుర్తింపు సైతం లభించడంతోపాటు పలు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు, ప్రపంచ పరిశోధకుల జాబితాల్లో స్థానం, పలు రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డులను విశ్వవిద్యాలయ అధ్యాపక బృందం సొంతం చేసుకున్నారు. అదే విధంగా 2022 నవంబర్‌లో విశ్వవిద్యాలయం న్యాక్ ఏ గ్రేడ్ సాధించి సత్తా చాటింది. విశ్వవిద్యాలయం 2023 జూన్‌లో విడుదల చేసిన ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో దేశంలోని అత్యుత్తమ విద్యాలయాల్లో 151 నుంచి 200 లోపు స్థానం సాధించింది. వీటితోపాటు పలు అవార్డులు, పలు ప్రాజెక్టులు సొంతం చేసుకుని అభివృద్ధి బాటలో పయనిస్తోంది.

**గ్రంథాలయ ప్రాంగణంలో..**

న్యాక్ ఏ గ్రేడ్ సాధించిన తర్వాత సరికొత్త హంగులతో విలసిల్లుతున్న విశ్వవిద్యాలయంలో శనివారం ఉదయం 10.00 గంటలకు వైవీయూలోని ఏపీజే అబ్దుల్‌కలాం కేంద్ర గ్రంథాలయ ప్రాంగణంలో 18వ వ్యవస్థాపక, కళాశాల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. వాస్తవానికి మార్చి 9వ తేదీన వ్యవస్థాపక దినోత్సవం రోజునే వేడుకలు నిర్వహించడం అనవాయితీ కాగా, వరుసగా సెలవులు రావడంతో విద్యార్థులు అందుబాటులో లేకపోవడంతో 23వ తేదీ శనివారం నిర్వహిస్తున్నారు. విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా తిరుపతి శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య వి.శ్రీకాంత్‌రెడ్డి, డాక్టర్ వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ వైస్ చాన్సలర్ ఆచార్య బి.అంజనేయ ప్రసాద్, న్యూఢిల్లీకి చెందిన ఎస్ఆర్ఎఫ్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ వై.సురేష్‌రెడ్డి విచ్చేయనున్నారు.

## వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పట్టణంలోని రంగారెడ్డికాలనీకి చెందిన గౌతమ్‌కుమార్ భార్య పి.గౌతమి కుటుంబ సమస్యలతో పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. అదే విధంగా పుంగనూరు మండలం ఈడిగపల్లె పంచాయతీ కోటగడ్డకు చెందిన కృష్ణప్ప కుమారుడు జి.రాఘవేంద్ర(19) తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపం చెంది పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆయా ఘటనల్లో కుటుంబ సభ్యులు బాధితులను ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

## బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

మదనపల్లె : బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి గాయపడిన సంఘటన శుక్రవారం కురబలకోట మండలంలో జరిగింది. చిన్నమండ్యంకు చెందిన సుబ్బయ్య కుమారుడు ఆకుల హరి(40) వ్యక్తిగత పనులపై ద్విచక్రవాహనంలో అంగళ్లుకు వచ్చాడు. పనులు ముగించుకుని తిరిగి వెళుతుండగా, ముదివేడు టోల్‌గేట్ వద్ద వాహనం అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

**బైక్‌పై నుంచి జారిపడి..**

మదనపల్లెకు చెందిన భారతి భర్తతో కలిసి వ్యక్తిగత పనులపై వాల్మీకిపురానికి వెళ్లి ద్విచక్రవాహనంలో తిరిగి వస్తుండగా, మార్గంమధ్యలోని పూలవాండ్లపల్లె వద్ద బైక్‌పై నుంచి జారి కిందపడి తీవ్రంగా గాయపడింది. గమనించిన స్థానికులు ఆమెను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

## ఉద్యోగాల పేరుతో అమ్మాయిలకు కుచ్చుటోపీ

- 50 మంది నుంచి రూ.5 లక్షలు వసూలు
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు



నందిని



నందినిపై ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బాధిత యువతులు

మదనపల్లె : ఓ ప్రముఖ ఆన్‌లైన్ వ్యాపార సంస్థలో ఉద్యోగాలు ఇప్పిస్తామని.. నిమ్మనపల్లె, మదనపల్లె, వాల్మీకిపురం మండలాల్లోని పలువురు అమ్మాయిలకు ఆశ చూపి, వారి నుంచి డబ్బులు వసూలు చేసి మోసం చేసిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. నిమ్మనపల్లె మండలం తవళం పంచాయతీ ఉంటావారిపల్లెకు చెందిన గంగిరెడ్డి భార్య ఎం.నందిని(32) ఆన్‌లైన్ వ్యాపార సంస్థలో పని చేస్తున్నానని చెప్పుకొంది. తాను పని చేస్తున్న కంపెనీలో ఉద్యోగావకాశాలు ఉన్నాయని, నిరుద్యోగ యువతులకు వల వేసింది. ఈ ఏడాది జనవరిలో డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగానికి ఒక్కొక్కరు సెక్యూరిటీగా రూ.10 వేలు చెల్లించాల్సి ఉంటుందని, కర్ణాటకలోని రాయల్పాడుకు ఆధార్, సర్టిఫికెట్లు, నగదుతో రావాలని చెప్పింది. నిజమని నమ్మిన సుమారు 50 మందికి పైగా యువతులు సుమారు రూ.5 లక్షలకు పైగా చెల్లించారు. బాధితుల నుంచి సర్టిఫికెట్లు, నగదు తీసుకుని.. ఫిబ్రవరి 2న మదనపల్లెలో ఆఫీసు ప్రారంభిస్తున్నట్లు తెలిపింది. అయితే కొన్ని కారణాలతో కార్యక్రమం వాయిదా పడిందని, మార్చి 21న ప్రారంభిస్తామని చెప్పింది. దీనికి సంబంధించి ఎలాంటి సమాచారం తెలపకపోవడం, కార్యాలయం ప్రారంభించకపోవడంతో బాధితులకు అనుమానం వచ్చి నందినిని నిలదీశారు. మోసపోయామని గ్రహించి మదనపల్లె పోలీసులను ఆశ్రయించారు. దీనిపై తాలూకా సీఐ శేఖర్ వివరణ ఇస్తూ.. బాధితులు కర్ణాటకలోని రాయల్పాడులో నందినికి నగదు చెల్లించినట్లు చెబుతున్నారని, ఈ విషయమై అక్కడి పోలీసులతో మాట్లాడామని, బాధితులను అక్కడికి వెళ్లి ఫిర్యాదు చేయాల్సిందిగా సూచించామన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో మెడికల్ రెప్ ఆత్మహత్య



అమరనాథ్ (ఫైల్)

మదనపల్లె : ఆర్థిక ఇబ్బందులతో మెడికల్ రెప్రజెంటేటివ్ ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం అర్ధరాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం యల్లంపల్లె పంచాయతీ బూజుపల్లెకు చెందిన దశరథశెట్టి కుమారుడు పి.అమరనాథ్(32) తన భార్య శోభారాణితో కలిసి ఐదేళ్ల క్రితం మదనపల్లె మండలం బసినికొండ పంచాయతీ రామాచార్లపల్లెలో అద్దె ఇంటిలో నివసిస్తున్నాడు. ఆయన మెడికల్ రెప్రజెంటేటివ్‌గా పని చేస్తున్నాడు. వీరికి ఏడాది వయసు ఉన్న బాబు ఉన్నాడు. వివిధ అవసరాల కోసం పలువురి వద్ద అధిక మొత్తంలో అప్పులు చేశాడు. ఇటీవల రుణదాతల నుంచి ఒత్తిడి అధికమవడంతో గురువారం రాత్రి ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన భార్యా శోభారాణి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి మృతదేహాన్ని కిందకు దించారు. వెంటనే తాలూకా పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. భార్య శోభారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శేఖర్ తెలిపారు.



## పోలీసులతో దురుసుగా ప్రవర్తించిన వ్యక్తి అరెస్ట్

మదనపల్లె : మద్యం మత్తులో పోలీసులతో దురుసుగా ప్రవర్తించడమే కాకుండా విధులకు ఆటంకం కలిగించినందుకు ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ యువరాజు తెలిపారు. శుక్రవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో నిందితుడి అరెస్ట్ చూపారు. ఈ సందర్భంగా సీఐ మీడియాతో మాట్లాడుతూ గురువారం రాత్రి ఎస్టేట్‌లోని డి-మార్ట్‌లో మద్యం సేవించి కొందరు గొడవ చేస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు వెళ్లారన్నారు. ఈ క్రమంలో ఘటనపై పోలీసులు విచారణ చేస్తుండగా, ఇసుకనూతిపల్లెకు చెందిన మునెప్ప కుమారుడు శ్రీనివాసులు(36) దురుసుగా ప్రవర్తించడంతోపాటు విధులకు ఆటంకం కలిగించాడన్నారు. దీనిపై కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టుకు పంపగా, మేజిస్ట్రేట్ ఏప్రిల్ 4 వరకు రిమాండ్ విధించారని చెప్పారు.

## 25 మంది బైండోవర్

గాలివీడు : 2024 సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా 25 మందిపై బైండోవర్ కేసు నమోదు చేశామని మండల ఎస్ఐ వెంకటప్రసాద్ శుక్రవారం తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అనుమానితులపై బైండోవర్ కేసును నమోదు చేయడం జరిగిందని పేర్కొన్నారు. మండలంలోని తూముకుంట, గరుగుపల్లెకు చెందిన సుమారు 25 మందిని అదుపులోకి తీసుకొని మండల తహసీల్దార్ ముందు హాజరుపరిచి, వ్యక్తిగత పూచికత్తుపై విడుదల చేయడం జరిగిందని వివరించారు.

# ఎక్కడికెళ్లినా ప్రజల బ్రహ్మరథం

**రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి**



భాకరాపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మేడా రఘునాథ్‌రెడ్డి

సిద్దవటం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన నవరత్నాలు గడప గడపకు చేరడంతో తాము ఎన్నికల ప్రచారం కోసం ఎక్కడికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ్‌రెడ్డి, రాజంపేట అసెంబ్లీ నియోజక వర్గ వైఎస్ఆర్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. సిద్దవటం మండల శివారులోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వారు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారాన్ని మొదలు పెట్టారు. ఈ సందర్భంగా వారు భాకరాపేట, సిద్దవటం, వంతాటిపల్లి, కడపాయపల్లి మరికొన్ని గ్రామాల్లో ఇంటింటికి తిరిగి రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డికి, ఎంపీ అభ్యర్థి పి.వి.మిథున్‌రెడ్డిల ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి, వేయించి గెలిపించాలని కోరారు. అనంతరం రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గంలోని ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలకు అందుబాటులో ఉండి సిద్దవటం మండల అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ రాజంపేట నియోజకవర్గ నాయకుడు ఆకేపాటి అనీల్‌కుమార్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ సిద్దవటం మండల ఇన్‌చార్జి మేడా మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి ఏకుల రాజేశ్వరిరెడ్డి, జిల్లా రైతు విభాగం కార్యదర్శి పల్లె సుబ్బరామిరెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శి వల్లిచాన్, వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ నీలకంఠారెడ్డి, పార్టీ నాయకులు కె.వి.సుబ్బయ్య, తుర్రా ప్రతాప్, నాగం నరసింహారెడ్డి, డాక్టర్ మురళి, ప్రదీప్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ గోపాలస్వామి, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ నూర్, మాజీ మండల యూత్ కన్వీనర్ క్రిష్ణ చైతన్య, హిదయతుల్లా, కె.వి.సుబ్బారెడ్డి, మాచనూరు సుబ్బారెడ్డి, విజయ్‌వర్ధన్, వి.పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# మనం చెబితే జనం ఓట్లెయ్యరు!

- వచ్చినోళ్లు వస్తారు, పోయినోళ్లు పోతారు
- ములకలచెరువులో ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి
- మండిపడుతున్న తంబళ్లపల్లె టీడీపీ క్యాడర్



ములకలచెరువులో పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న రాంగోపాల్‌రెడ్డి

బి.కొత్తకోట : తంబళ్లపల్లె నియోజకవర్గంలో టీడీపీకి తాము చెబితే జనం ఓట్లెయ్యరని ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి తేల్చి చెప్పేశారు. గంపగుత్తగా పార్టీకి ఓట్లు వేసే పరిస్థితి కూడా లేదని పార్టీ క్యాడర్ సమక్షంలోనే చెప్పి, మనం ఆర్గనైజర్లుగా మాత్రమే వ్యవహరించాలని సూచించడంతో నియోజకవర్గంలో టీడీపీ పరిస్థితి ఏ స్థాయిలో ఉందో చెప్పకనే చెప్పేశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 20వ తేదీ(బుధవారం) తంబళ్లపల్లె నియోజకవర్గం ములకలచెరువులో టీడీపీ అభ్యర్థికి చెందిన కార్యాలయంలో పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ఎన్నికల వ్యవహారంపై టీడీపీ అభ్యర్థి మంచోడైతేనే ఓట్లు వేస్తారని కూడా చెప్పడంతో సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు చర్చించుకోవడం విశేషం. ఎమ్మెల్సీ మాట్లాడుతూ మనం చెబితే ఎవరూ ఓట్లు వేయరు, మనం ఆర్గనైజర్లుగా పని చేయాలన్నారు. నేను చెబితేనో, మీరు చెబితేనో తండోపతండాలుగా ఓట్లు వేసే పరిస్థితి గ్రామాల్లో లేదు.. వాళ్లకు నచ్చిన పార్టీకి ఓట్లు వేస్తారు, మన అభ్యర్థి మంచోడైతే మనకు ఓట్లు వేస్తారని, లేకపోతే అవతలి పార్టీకి ఓట్లు పడ్తాయని, లీడర్లను చూసి ఓట్లు వేసే పరిస్థితులు పోయాయని కుండబద్దలు కొట్టారు. ఇదే క్రమంలో నిన్ను, నన్ను చూసి ఓట్లు వేయరని స్పష్టంగా చెప్పారు. ప్రధానంగా టీడీపీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న జయచంద్రారెడ్డిని పార్టీ క్యాడర్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్న పరిస్థితుల్లో రాంగోపాల్‌రెడ్డి ప్రసంగం నియోజకవర్గ టీడీపీలో అగ్గి రాజేసింది. ఈ సమావేశం తర్వాత హాజరైన పార్టీ నాయకులతో రాంగోపాల్‌రెడ్డి ముచ్చటిస్తూ అభ్యర్థికి మద్దతు ఇవ్వని వాళ్లని పార్టీ నుంచి సస్పెన్షన్ చేయిస్తానని చెప్పినట్టు క్యాడర్‌లో ప్రచారం జరుగుతోంది. ఈ వ్యాఖ్యలపై నియోజకవర్గ టీడీపీలో అభ్యర్థి జయచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డిలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు హోరెత్తిస్తున్నారు.

**ఎమ్మెల్సీకి ఏం సంబంధం?**

తంబళ్లపల్లెతో రాంగోపాల్‌రెడ్డికి ఏం సంబంధం ఉందని టీడీపీ నాయకులు ప్రశ్నిస్తున్నారు. పలువురు నాయకులు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. వచ్చేవాళ్లు వస్తారు, పోయేవాళ్లు పోతారు అంటూ స్థానిక లీడర్లపై అవహేళనగా మాట్లాడతారా. నియోజకవర్గ స్థితిగతులు తెలియని, అసలు సంబంధమేలేని ఎమ్మెల్సీని అభ్యర్థి జయచంద్రారెడ్డి పిలిపించుకుని మమ్మల్ని తక్కువ చేసి మాట్లాడించడం వెనుక ఉద్దేశమేమిటి అంటూ నిలదీస్తున్నారు. పార్టీకి దూరంగా ఉంటున్న నాయకులను కలుపుకొని వెళ్లాలి, వారిని బుజ్జగించాలి కానీ బెదిరింపు ధోరణితో మాట్లాడటం ఏమిటని నిలదీశారు. కొన్ని పోస్టుల్లో ఎమ్మెల్సీని ఉద్దేశించి ఖబడ్దార్ అంటూ హెచ్చరిస్తూ టీడీపీ శ్రేణులు పెట్టిన కొన్ని పోస్టులను తొలగించారు. జిల్లావాసి కాని ఎమ్మెల్సీ తంబళ్లపల్లెపై ఎందుకు ఆసక్తి చూపుతున్నారంటూ టీడీపీ క్యాడర్ అనుమానాలను వ్యక్తం చేస్తోంది. ఇటీవల రెండు సార్లు ఇక్కడికి రావడం వెనుక మతలబు ఏమిటని ఆరా తీస్తున్నారు. జిల్లాకు చెందిన సీనియర్ నాయకులు ఉన్నా తంబళ్లపల్లెవైపు కన్నెత్తి చూడలేదు కానీ ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ఒక్కరే ఇక్కడి టీడీపీ రాజకీయాలపై శ్రద్ధ చూపడం, అభ్యర్థికి మద్దతుగా మాట్లాడటం, వ్యతిరేక వర్గాలను మందలించినట్లుగా మాట్లాడటం పార్టీలో తీవ్ర చర్చనీయాంశమైంది.

## నవశకం

వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపురేఖలు నాడు-నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్థోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్

### పాఠశాలకు అన్ని సౌకర్యాలు



నాడు-నేడు కింద మదనపల్లె మండలం బసినికొండ జెడ్పీ ఉన్నత పాఠశాలకు అన్ని సౌకర్యాలు సమకూరాయి. నూతనంగా గదులు నిర్మించారు. బాత్‌రూములు, లెట్రిన్‌లు ఏర్పాటు చేశారు. తాగునీటి సౌకర్యం కల్పించారు. తరగతి గదిలో ఫర్నీచర్, ఇతర సదుపాయాలు కల్పించారు. దీంతో మా పాఠశాల విద్యార్థులు చక్కగా చదువుకుంటున్నారు.

– భాస్కరన్, ఉపాధ్యాయుడు, జెడ్పీహెచ్ఎస్, బసినికొండ, మదనపల్లె మండలం

### నెరవేరిన సొంతింటి కల



మేము పులివెందుల పట్టణంలోని అంబకపల్లె రోడ్డులో ఉన్న రజక కాలనీలో అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నాము. గత ప్రభుత్వ హయాంలో అనేకమార్లు ఇంటికోసం దరఖాస్తు చేసుకున్నా మంజూరు కాలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత నవరత్నాల్లో భాగంగా పేదల సొంతింటి కల నెరవేర్చాలన్న లక్ష్యంతో జగనన్న కాలనీల పేరుతో ఊర్లను నిర్మిస్తున్నారు. జగనన్న కాలనీలో నాకు ఇల్లు మంజూరు కావడంతో సొంతింటి కల నెరవేరింది. మా కుటుంబ సభ్యులందరం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– మహేశ్వరి, లబ్ధిదారురాలు, పులివెందుల

## 108 వాహనంలో ప్రసవం

నిమ్మనపల్లె : అత్యవసర ఆరోగ్య సమయాల్లో ఆపద్బాంధవిగా సేవలందిస్తున్న 108 వాహనం పండంటి బిడ్డ జన్మించేందుకు పాన్పు అయింది. 108 వాహనంలో పండంటి బిడ్డ జన్మించిన ఘటన శుక్రవారం తెల్లవారుజామున నిమ్మనపల్లె మండలంలో జరిగింది. మండలంలోని నిమ్మనపల్లె పంచాయతీ బొంతలవారిపల్లెకు చెందిన వెంకటేశ్వర్లు భార్య అనిత(20)కు తెల్లవారుజామున పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. ఈఎంటీ రెడ్డి జస్వంత్, పైలెట్ అమరనారాయణ వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని ఆమెను మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలిస్తుండగా.. మార్గంమధ్యలో తెల్లవారుజామున 4:30 గంటలకు పండంటి ఆడ పిల్లకు జన్మనిచ్చింది. తల్లీ బిడ్డ క్షేమంగా ఉండడంతో ప్రసవానంతర చికిత్సల కోసం వారిని జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు.

## ఎస్పీని ఆశ్రయించిన ప్రేమజంట

రాయచోటి టౌన్ : మమ్మల్ని ఎవరూ కిడ్నాప్ చేయలేదని ప్రేమజంట ఎస్పీ కృష్ణారావును ఆశ్రయించారు. ప్రేమికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అన్నమయ్య జిల్లాలోని రాజంపేట నియోజకవర్గం నందలూరుకు చెందిన అర్షద్ తిరుపతికి చెందిన ఒక అమ్మాయిని ప్రేమించాడు. అయితే వీరి ప్రేమను అమ్మాయి బంధువులు ఒప్పుకోకపోవడంతో.. అతను ముంబయికి వెళ్లిపోయాడు. అమ్మాయి తనకు ఇష్టం లేని వివాహం చేస్తున్నారని తెలుసుకొని ఇంటిలో ఎవరికీ తెలియకుండా గత కొన్ని రోజుల క్రితం ముంబయికి వెళ్లింది. దీంతో తమ కుమార్తెను ఎవరో కిడ్నాప్ చేశారని అమ్మాయి తల్లిదండ్రులు తిరుపతి పోలీసులకు ఫిర్యాదు ఇవ్వడంతో విచారణ చేపట్టారు. ఆమె రాజంపేటకు చెందిన అర్షద్ వద్ద ఉన్నట్లు తేలడంతో వీరిని అన్నమయ్య జిల్లా ఎస్పీ కార్యాలయానికి తీసుకొచ్చారు. అయితే వీరు మాత్రం తమను ఎవరూ కిడ్నాప్ చేయలేదని ఎస్పీకి చెప్పడంతో వారి కుటుంబ పెద్దలను పిలిచి కౌన్సెలింగ్ ఇస్తున్నారు.

## గాయపడిన విద్యార్థి మృతి



జశ్వంత్(ఫైల్)

ములకలచెరువు : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విద్యార్థి చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బురకాయలకోట పంచాయతీ బలకవారిపల్లెకు చెందిన జశ్వంత్‌రెడ్డి(17) ద్విచక్రవాహనంలో వెళ్తుండగా మంగళవారం సెంట్రల్‌స్కూల్ వద్ద బొలేరో వాహనం ఢీ కొనడంతో తీవ్ర గాయాలైన సంఘటన తెలిసిందే. కర్ణాటక రాష్ట్రం బెంగళూరులోని ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతున్నా.. పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. పోలీసులు మదనపల్లె ప్రభుత్వ హాస్పిటల్‌లో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. విద్యార్థి మృతి చెందడంతో బలకవారిపల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు బొలేరో వాహనం సీజ్ చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.